క్లుప్తంగా

వర్క్‌షాప్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్, తదితరులు

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ ఫొటోగ్రామెట్రీ అండ్ రిమోట్ సెన్సింగ్ సంస్థతో సంయుక్తంగా జియోస్పటిల్ టెక్నాలజీస్ ఫర్ ఎన్విరాన్మెంటల్ ఇష్యూస్ అనే అంశంపై ఒక్క రోజు వర్క్‌షాప్ సెప్టెంబర్ 20న నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్‌నకు సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ ఆయన కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి ఆచార్య కె.రాంబాబు, వర్క్‌షాప్ కన్వీనర్ ఆచార్య వజీర్ మహ్మద్, ఆచార్య కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి చెక్కు అందజేత



మృతుడు సన్యాసిరావు భార్యకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే, తహసీల్దార్

ఆరిలోవ : నగరంలో ఇటీవల గ్యాస్ లీకై జరిగిన పేలుడులో నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. వారిలో పన్నెండో వార్డు పరిధి రాజీవ్‌నగర్‌కు చెందిన తాండ్రంగి సన్యాసిరావు (40) మృతి చెందాడు. దీంతో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ, రూరల్ తహసీల్దార్ పాల్‌కిరణ్ మృతిని ఇంటికి గురువారం వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.10 లక్షల చెక్కును మృతుడి భార్యకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు, ఏడువాక సన్యాసిరావు, సత్యం, పోలారావు పాల్గొన్నారు.

రామాలయానికి తాళం వేసిన టీడీపీ నాయకులు



రామాలయానికి వేసిన తాళాలను చూపుతున్న సర్పంచ్ అప్పారావు

పరవాడ: కూటమి నేతలు గ్రామాల్లో అరాచకాలకు పాల్పడుతున్నారు. అందుకు అనకాపల్లి జిల్లా మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి స్వగ్రామమైన వెన్నలపాలెం వేదికగా మారడం గమనార్హం. వినాయక చవితి వేడుకలు సందర్భంగా గ్రామంలోని రామాలయానికి కూటమి నాయకులు తాళాలు వేయడం వివాదానికి దారితీసింది. రామాలయంలో వినాయకుడిని నిలిపి సర్పంచ్ తొలిపూజ చేయడం ఆనవాయితీ. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీకి చెందిన గ్రామ సర్పంచ్ వెన్నల అప్పారావు తొలి పూజ చేసేందుకు భక్తులతో కలిసి బుధవారం ఉదయం 6 గంటలకు రామాలయానికి రాగా, అప్పటికే టీడీపీ నాయకులు ఆలయానికి తాళాలు వేసి వెళ్లడంతో అంతా అవాక్కయ్యారు. పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావుతో రామాలయాన్ని వెంటనే తెరిపించాలని వాగ్వావాదానికి దిగారు. టీడీపీ నాయకులకు పోలీసులు వంత పాడడంతో వారి అరాచకాలు, దాడులకు అడ్డూఅదుపూ లేకుండా పోతోందని సర్పంచ్ అప్పారావు ఆరోపించారు. ఎట్టకేలకు సీఐ మల్లికార్జునరావు కల్పించుకుని తాళాలు తెరిపించి, సర్పంచ్ అప్పారావు దంపతులతో తొలిపూజలు జరిపించడంతో ఘర్షణ సద్దుమణిగింది.

అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ జరిపారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.



అంబేడ్కర్‌నగర్‌లో విఘ్నేశ్వరుడిని దర్శించుకుంటున్న మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, నాయకులు



పదమూడో వార్డులో విఘ్నేశ్వరుడిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, నిర్వాహకులు



23వ వార్డులోని మండపంలో పూజలు చేస్తున్న భక్తులు



16వ వార్డులోని మండపంలో మొల్లి అప్పారావు, నాయకులు

ఘనంగా గణనాథుడి ఉత్సవాలు

- వాడవాడలా మండపాలతో సందడి
- వర్షం తెరిపివ్వడంతో ఉత్సాహంగా వేడుకలు



విశాలాక్షినగర్‌లో రాజ సింహాసనంపై వినాయక విగ్రహం



జీవీఎంసీ 10వ వార్డు ఆదర్శనగర్‌లో ఏర్పాటు చేసిన మండపంలో వినాయకుడిని దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, నాయకులు



ఆకట్టుకుంటున్న గణపతి విగ్రహం



పన్నెండో వార్డులో వినాయకుడిని దర్శించుకుంటున్న మొల్లి అప్పారావు



ఎంవీపీ రైతు బజార్‌లో గణనాథుడిని దర్శించుకుంటున్న రైతులు

ఆరిలోవ : విశాఖ తూర్పు నియోజకవర్గంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. సోమ, మంగళవారాల్లో భారీగా కురిసిన వర్షం బుధవారం ఉదయం నుంచి తెరిపివ్వడంతో వేడుకలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. వాడవాడలా ఏర్పాటు చేసిన మండపాల వద్ద భక్తుల సందడి నెలకొంది. నియోజకవర్గంలోని 15 వార్డుల పరిధిలో గల వందలాది మండపాల్లో భిన్న రూపాల్లో గణనాథులు కొలువుదీరారు. జీవీఎంసీ 9 నుంచి 13వ వార్డు పరిధిలోని జోడుగుళ్లపాలెం, విశాలాక్షినగర్ నుంచి హనుమంతవాక, పెదగదిలి, చినగదిలి, ఆరిలోవ, పైనాపిల్‌కాలనీ, బాలాజీనగర్, తోటగరువు, రవీంద్రనగర్, ఆదర్శనగర్, ఇందిరానగర్ వరకు సుమారు 140 వినాయక మండపాలు ఏర్పాటు చేశారు. వాటిలో విగ్రహాలు ఏర్పాటు చేసి శాస్త్రోక్తంగా పూజలు జరిపించారు. అపార్టుమెంట్లలో ఒక్కరోజు ఉత్సవాలు జరిపి బుధవారం సాయంత్రం అనుపోత్సవం నిర్వహించారు.

- జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, సంజీవినగర్, హనుమంతవాక, సంజయ్‌గాంధీనగర్ ప్రాంతాల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. విశాలాక్షినగర్‌లో ఉత్తమ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం స్థానికులను విశేషంగా ఆకట్టుకుంటోంది. రాజ సింహాసనంపై వినాయకుడు కూర్చున్నట్లు ఇక్కడ ఏర్పాటు చేశారు.
- 10వ వార్డులో ఆదర్శనగర్, ఇందిరానగర్, రవీంద్రనగర్‌లో విగ్రహాలను ఆకర్షణీయంగా ఏర్పాటు చేశారు. ఆయా మండపాల్లో వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, పార్టీ వార్డు అధ్యక్షుడు పతివాడ కనకరాజు, నాయకులు పూజలు చేశారు.
- పదకొండో వార్డులో బాలాజీనగర్, అంబేడ్కర్‌నగర్, భరత్‌నగర్, డ్రైవర్స్‌కాలనీ, అప్సరాకాలనీ, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లోని వినాయక మండపాలు ఆకట్టుకుంటున్నాయి. ఆయా మండపాల్లోని విగ్రహాలను మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వైఎస్సార్ సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ దర్శించుకుని పూజలు చేశారు.
- పన్నెండో వార్డు పరిధి తోటగరువు, టి.ఐ.సి పాయింట్, లీలాసుందరినగర్, నెహ్రూనగర్, చినగదిలి, పెదగదిలి, సూర్యతేజానగర్, సంతపాలెం తదితర ప్రాంతాల్లో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, స్థానిక నాయకులు హేమంత్, బుజ్జి పూజలు చేశారు.
- పదమూడో వార్డు పరిధి దారపాలెం, పైనాపిల్‌కాలనీ, ఆరిలోవ కాలనీ, దుర్గాబజార్, దుర్గానగర, దీన్‌దయాల్‌పురం, శివాజీనగర్ 1, 2 ప్రాంతాల్లో పలుచోట్ల వినాయక ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆయా మండపాలను వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు సత్యాల వెంకట్, ప్రసంగి వాసు తదితరులు దర్శించుకుని గణనాథుడికి పూజలు చేశారు.

మద్దిలపాలెం : జీవీఎంసీ 16, 23వ వార్డుల్లోని కాలనీల్లో వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన మండపాలను వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చొల్లంగి నాగేశ్వరరావు, బూస రమణారెడ్డి, పులగం సూర్యనారాయణ రెడ్డి, మీసాల ప్రదీప్, ఎండ్రెడ్ల ఈశ్వరరెడ్డి, వేములవలస అప్పారావు, పిలక సంపత్, శరగడం వేణుగోపాల రెడ్డి, చింతా వెంకటరావు, బమ్మిడి జోగారావు, మెట్ట సూర్యనారాయణ, బొట్ట కిషోర్, నానాజీ, తదితరులు పాల్గొన్నారు.

- పాత వెంకోజీపాలెంలోని శ్రీ సీతారామ యూత్ ఆధ్వర్యంలో శివుని ఆకారంలో ఏర్పాటు చేసిన 11 అడుగుల వినాయక మట్టి విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కొత్త వెంకోజీపాలెంలోని ఆటో స్టాండ్, గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు సభ్యులు తెలిపారు.
- జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురంకాలనీలో సాయిబాబా మందిరం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇక్కడ సాయంత్రం వేళల్లో కోలాటంతో సందడి చేస్తున్నారు.

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీలో వినాయక చతుర్థి వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీటీడీ కూడలిలో విశాఖ రియల్ ఎస్టేట్ మెంబర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిద్ధి వినాయక మహోత్సవ కమిటీ ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడి మండపం సెట్టింగు అందరినీ ఆకట్టుకుంది. అసోసియేషన్ ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 5న అన్నదానం, 6న లడ్డు వేలం నిర్వహించనున్నారు.

- ఎంవీపీ కాలనీ రైతు బజార్‌లో రైతులంతా ప్రత్యేక స్టాల్‌లో గణేషుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. స్టాల్‌ను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. 5 రోజులపాటు ప్రత్యేక పూజలు చేయనున్నట్లు తెలిపారు. రైతు బజార్ ఈవో వరహాలు, సహాయకుడు కనకరాజు పాల్గొన్నారు.
- ఎంవీపీ కాలనీ సెక్టార్ – 2లో స్థానిక నివాసితుల సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. భక్తులు, సందర్శకులకు ప్రసాదం పంపిణీ చేశారు.

బీచ్‌రోడ్డు : జీవీఎంసీ 20వ వార్డులోని పెదవాల్తేరు గాంధీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన 25 తలల వినాయకుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ఈ వినాయకుడిని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముఠ్వల సురేష్ సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. పెదవాల్తేరు న్యూ యూత్ స్టార్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో తోట ముకుంద ప్రత్యేక పూజలు చేశారు.



25 తలల వినాయకుడిని దర్శించుకుంటున్న ముఠ్వల సురేష్



వినాయకుడిని దర్శించుకుంటున్న తోట ముకుంద, తదితరులు



ఎంవీపీ కాలనీ టీటీడీ కూడలిలో ఏర్పాటు చేసిన వినాయకుడు



ఎంవీపీ కాలనీ సెక్టార్ - 2 పూజల్లో పాల్గొన్న మహిళలు

కన్నబాబుకు వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ

కాకినాడ రూరల్ : పితృ వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబును ఆ పార్టీ విశాఖపట్నం నాయకులు గురువారం పరామర్శించారు. కాకినాడ వైద్యనగర్‌లోని నివాసంలో పార్టీ విశాఖ తూర్పు నియోజకవర్గ కో ఆర్డినేటర్ మొల్లి అప్పారావు, జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ముఠ్వల సురేష్ తదితరులు కన్నబాబును పరామర్శించి, ఆయన తండ్రి సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ విశాఖ జిల్లా నాయకులు బోని శివరామకృష్ణ, దేవరకొండ మార్కండేయులు, బొండా ఉమామహేశ్వరరావు, అక్కరమాని మంగరాజు, పీతల గోవింద్, కనకరాజు, హేమంత్, వెంకట్, రవి, నాగేశ్వరరావు, ప్రదీప్, నీలారెడ్డి, కల్యాణ్, కుమార్‌రెడ్డి, రమణారెడ్డి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



కాకినాడలో కన్నబాబు తండ్రి సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొలువుదీరిన వెండి వినాయకుడు

ఏయూ క్యాంపస్ : ప్రజలందరి విఘ్నాలు తొలగించే గణపతికి విఘ్నాలు ఎదురయ్యాయి. బీచ్‌రోడ్డులోని ఏపీఐఐసీ మైదానంలో ఏర్పాటు చేసిన జర్మన్ సిల్వర్ గణపతి విగ్రహ ప్రతిష్ఠకు ఆటంకాలు ఎదురయ్యాయి. సుమారు రెండు వేల కేజీల జర్మన్ సిల్వర్ గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నట్లు నిర్వాహకులు ముందుగానే ప్రకటించారు. వివిధ కారణాలతో బుధవారం సాయంత్రం వరకు విగ్రహం వేదిక వద్దకు చేరకోలేదు. దీంతో నగరవాసులు కొంత నిరాశతో వెనుతిరిగారు. ఎట్టకేలకు రాత్రికి విగ్రహం మైదానానికి చేరుకుంది. వర్షం కారణంగా మైదానంలోకి భారీ విగ్రహం తీసుకురావడం ఇబ్బందిగా మారింది. నిర్వాహకులు ఎంతో శ్రమకోర్చి విగ్రహాన్ని వేదిక వద్దకు చేర్చారు. గురువారం ఉదయం నుంచి దర్శనాలకు భక్తులను అనుమతించారు. ఉచిత ప్రవేశం కల్పించడంతో భక్తులు పెద్ద సంఖ్యలో జర్మన్ సిల్వర్ వినాయకుడిని దర్శించుకున్నారు. ప్రాంగణం చుట్టూ ఆకుపచ్చని మొక్కలతో సుందరంగా అలంకరించారు.



వెండి వినాయకుడి విగ్రహం

అభివృద్ధిలో ఎన్జీవోల పాత్ర కీలకం

సీతంపేట: అభివృద్ధి కార్యక్రమాల్లో ఎన్జీవోల పాత్ర కీలకమని ఎస్ఆర్‌యూ జీవీఎంసీ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ శ్రీనివాస రాజమణి అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం జరిగిన ఎన్జీవో ఫోరం సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. జీవీఎంసీ నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలన్నీ భాగస్వాములు కావాలని కోరారు. తమ సస్టైనబుల్ రెలిజియన్స్ యూనిట్ అందిస్తున్న సేవలను వివరించారు. రిసోర్స్ పర్సన్ సుశాంత్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులు ఏవిధంగా సేకరించవచ్చు తెలియజేశారు. కాలేశ్వరరావు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు ఏయే పుస్తకాలు నిర్వహించాలి, అకౌంట్స్ నిర్వహణ, ఆడిటింగ్ నిర్వహించడం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. బాలల హక్కులపై పనిచేస్తున్న చిట్టిబాబు మాట్లాడుతూ బాలలతో పనిచేస్తున్న సంస్థలు ఏయే రిజిస్ట్రేషన్లు చేయించాలి, అవసరమైన పుస్తకాల నిర్వహణ, ఏయే ప్రభుత్వ శాఖలను సంప్రదించాలో వివరించారు. కార్యక్రమంలో వైజాగ్ ఎన్జీవో ఫోరం అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి, ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజు, కార్యదర్శి జె.వి.రత్నం, కోశాధికారి అబ్దుల్ మునీర్, సభ్యులు భాస్కరరావు, డాక్టర్ శశిప్రభ, ప్రకాశరావు, ప్రజ్ఞాన్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎన్జీవో ప్రతినిధులు

ముగిసిన సంగీత నృత్యోత్సవాలు



శ్రీ ఖడ్గ తిక్కన నాటకంలో సన్నివేశం

మద్దిలపాలెం : విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతిలో నిర్వహిస్తున్న సంగీత నృత్య నాటక మహోత్సవాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. ఆఖరి రోజు ప్రదర్శించిన శ్రీ ఖడ్గ తిక్కన నాటకం అందరినీ అబ్బురపరిచింది. కార్యక్రమాన్ని వీఎండీఏ అధ్యక్షుడు మంతెన సత్యనారాయణ రాజు, కార్యదర్శి రాంబాబు, కోశాధికారి పైడా క్రిష్ణ ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విజయవాడకు చెందిన డాక్టర్ రామన్ ఫౌండేషన్ వారి సాయిబాబా నాట్యమండలి సభ్యులు చారిత్రాత్మక పద్యనాటకం శ్రీ ఖడ్గ తిక్కన ప్రదర్శించారు. దీనికి డాక్టర్ పి.వి.ఎస్.క్రిష్ణ రచన, దర్శకత్వం వహించగా 38 మంది నటీనటులు ప్రేక్షకులను నటనతో మైమరిపించారు.

తెలుగుతల్లి విగ్రహానికి నీరాజనాలు నేడు

మద్దిలపాలెం : గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా శుక్రవారం మద్దిలపాలెం కూడలిలో గల తెలుగుతల్లి విగ్రహానికి నీరాజనాలు అర్పించనున్నామని తెలుగుదండు వ్యవస్థాపకుడు పరవస్తు ఫణిశయన సూరి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు భాష అమలుపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ప్రశ్నించనున్నామని ఆయన తెలిపారు.

రచయితకు గ్రహణశక్తి అవసరం



మాట్లాడుతున్న రచయిత సూర్యారావు

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రిజం కళాశాలలో గురువారం నిర్వహించిన కథా కచేరి ఆకట్టుకుంది. పలువురు రచయితలు చదివి వినిపించిన స్వీయ కథానికలు వైవిధ్యభరితంగా అలరించాయి. రచయిత డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ కథా రచయితకు మంచి గ్రహణశక్తి ఉండాలని, కథలో విశ్వజనీన ఉండాలన్నారు. కథ పేరు చెబితే రచయిత గుర్తుకు రావాలని, ఆవిధంగా ప్రతి రచయిత గుర్తుండిపోయేలా కథలు రాయాలని సూచించారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కథలు జీవిత వాస్తవాలకు ప్రతిబింబాలన్నారు. కథలో శిల్పం చక్కగా ఉండి ఉదాత్తత కలిగి ఉండాలన్నారు. డాక్టర్ సి.హెచ్.నిర్మలాదేవి మాట్లాడుతూ కథలు సంఘటనల నుంచి కూడా పుడతాయని, కథకు స్పందన అవసరమన్నారు. కార్యక్రమంలో రచయితలు రాంభట్ల నృసింహశర్మ, సిహెచ్.చిన సూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణ మూర్తి, సోమంచి వినయ భూషణరావు, కె.వి.ఎస్.మూర్తి, కె.భీమేశ్వరరావు, బి.రాధారాణి, తనికెళ్ల సూర్యకళ, ఆర్.శివాజీ స్వీయ కథలు వినిపించారు.

30న రాష్ట్ర బీసీ సంఘం రిలే నిరాహారదీక్ష

ఎంవీపీ కాలనీ : ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 30న రిలే నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు సంఘం ఉత్తరాంధ్ర కన్వీనర్ గొర్లె శ్రీనివాస నాయుడు వెల్లడించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు సంకారపు జయశ్రీ పిలుపు మేరకు ఈ నెల 30న శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్ష ప్రారంభిస్తామని తెలిపారు. ఎంవీపీ కాలనీలోని సంఘం కార్యాలయంలో గురువారం ఈ వివరాలు వెల్లడించారు. మహిళ రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ మహిళల కోటాను సబ్ డివిజన్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ ఒక్కరోజు రిలే నిరాహారదీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. సంఘం నాయకురాలు ఇళ్ల గాయత్రి మాట్లాడుతూ 33 శాతం మహిళ రిజర్వేషన్‌లో ఓబీసీ మహిళ వాటాను కేంద్ర ప్రభుత్వం నిగ్గుతేల్చాలన్నారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేస్తూ ఈ దీక్షకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ దీక్షలో రాష్ట్ర నాయకులు అతిథులుగా పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో బీసీ స్టడీ సర్కిల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇళ్ల వెంకటేశ్వరరావు, ఎన్ని శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు పల్ల రమణ యాదవ్, మహిళ నాయకులు దీప్తి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న శ్రీనివాస నాయుడు, తదితరులు

వైభవంగా లక్ష్మీగణపతి హోమం

తాటిచెట్లపాలెం: లోక హితార్థం హోమాలు, క్రతువులు చేయడం వల్ల దేశం సుభిక్షంగా ఉంటుందని జగద్గురు పీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ అన్నారు. వినాయక చవితి సందర్భంగా తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఇ.కె. సంస్కృతి సదన్ ప్రాంగణంలో ఘనంగా శ్రీలక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక హితం కోసం వరల్డ్ టీచర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మాస్టర్ ఇ.కె. అనేక ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు నిర్వహించారని, దీనిలో భాగంగా సంప్రదాయ పూజలు, రుద్రాభిషేకం, అగ్నిహోత్రాది క్రతువులు ఏర్పాటు చేశారని తెలిపారు. క్రతువులో సంస్థ కార్యదర్శి బి.ఆర్.కె.రాజు, ప్రాంతీయ గణపతులు బి.శ్రీనివాసరావు(విజయనగరం), ఎంఎస్ఆర్ స్వామి(లాసన్స్ బే కాలనీ), బాలబాను విద్యాలయం ప్రిన్సిపాల్ ఎస్.శుభశ్రీ, గూటాల రమణ(న్యూయార్క్), మాస్టర్ హోమియో వైద్యాలయం సేవకుడు ఎస్.వి.సత్యనారాయణ, జనకులం ఫౌండేషన్ ధర్మకర్త సిహెచ్.శ్రీనివాసరాజు, ట్రస్ట్ డైరెక్టర్ బి.ఉషారాణి, దాట్ల రాధ, గొల్లపూడి రవికుమార్, ఎ.శైలజ పాల్గొన్నారు.